క్లుప్తంగా

తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మండలి



నాగాయలంక: అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు, జనసేన యువనేత వెంకట్రామ్(రాజా)తో కలిసి మంగళవారం నాగాయలంక మండలం తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని భావదేవరపల్లి, కమ్మనమోలు గ్రామాల పరిధిలో పర్యటించిన ఆయన పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న రైతులను పలుకరించారు. ఈ సందర్భంగా సాగునీటి సమస్యపై ఆరా తీశారు. వ్యవసాయ పనులు పూర్తయ్యేవరకు ఎప్పటికప్పుడు సాగునీటి పారుదల, డ్రైనేజీల పనితీరుపై అధికారులను అప్రమత్తం చేస్తూ రైతులకు మేలు జరిగేలా నిరంతరం పరిశీలిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ళ రవికిరణ్, నాగాయలంక సెక్షన్ ఏఈఈ పొన్నూరు రవితేజ తదితరులు ఎమ్మెల్యే వెంట పర్యటించారు.

కూలీలతో కలిసి నాట్లు వేసిన ఎస్ఐ శిరీష



కోడూరు: కోడూరు ఎస్ఐ శిరీష కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. మండలంలోని రామకృష్ణాపురం రహదారి సమీపంలో మంగళవారం మహిళా కూలీలు వరినాట్లు వేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఎస్ఐ శిరీష వెంటనే పంటపొలంలోకి వెళ్లి కూలీలతో కలిసి తాను కూడా వరినాట్లు వేశారు. తమది వ్యవసాయ కుటుంబమేనని, తన తల్లిదండ్రులు వ్యవసాయ పనులే చేసి తనను ఈ స్థాయికి తీసుకువచ్చారని ఎస్ఐ వారితో చెప్పారు. తన తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లిన రోజులు గుర్తుకు వచ్చాయని ఎస్ఐ శిరీష భావోద్వేగంతో అన్నారు.

స్టాకు పాయింట్ వద్ద సిబ్బంది మార్పు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు పాయింట్ వద్ద సిబ్బందిని మారుస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. 'పగలు తోడేస్తూ.. రాత్రి తోలేస్తూ..' శీర్షికన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద పరిస్థితులపై 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు స్టాకు యార్డు వద్ద నెల రోజులుగా పని చేస్తున్న ఏడుగురు సిబ్బందిని మారుస్తున్నట్లు తెలిపారు. రెండు షిఫ్టులుగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బాబు మెతకే.. వెనక మేమున్నాం..

- తాము చెప్పినట్లు వినాలని టీడీపీ నాయకుల ఆదేశాలు
- ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులపై తీవ్ర ఒత్తిళ్లు
- అధికారులను సైతం ఏకవచనంతో సంబోధిస్తున్న వైనం
- షాడో ఎమ్మెల్యేల తీరుతో తలపట్టుకుంటున్న ఎమ్మెల్యే బాబు



సాక్షి నెట్‌వర్క్: 'ఎమ్మెల్యే బాబు చాలా మెతక. ఏం మాట్లాడటం లేదని అనుకోవద్దు. మీరు అలా అనుకుని తేలిగ్గా తీసుకుంటే సహించేది లేదు. బాబు వెనుక మేం ఉన్నాం. మా దృష్టికి అన్నీ తెలుస్తాయి. మేము చెప్పినట్లు వినాల్సిందే' అంటూ నియోజకవర్గంలోని అధికారులు, ఉద్యోగులపై టీడీపీ మండల స్థాయి నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. తన మాటను సైతం కాదని, తమ పంతమే నెగ్గాలనేలా షాడో ఎమ్మెల్యేల్లా మండల స్థాయి నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది. మండల స్థాయి నాయకులు తమను ఏకవచనంతో పిలుస్తుండటం అధికారులకు మింగుడు పడటం లేదు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం పక్క నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితి ఇదీ..

- నియోజకవర్గంలోని ఒక మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐకు ఎమ్మెల్యే బాబు తానున్నానంటూ భరోసా ఇచ్చారు. అయితే షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తున్న మండల నాయకుడు మాత్రం ఆ ఎస్ఐ బదిలీకి పట్టుబట్టారు. ఇటీవల పక్క నియోజకవర్గానికి చెందిన ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొట్టి ఆ మండలానికి చెందిన వృద్ధుడు ఒకరు తీవ్రంగా గాయపడి చనిపోయారు. ఈ కేసును రాజీ చేయడంలో సదరు మండల స్థాయి నాయకుడు చక్రం తిప్పి పెద్ద మొత్తంలో నగదును తన జేబులో వేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసును రాజీచేసే క్రమంలో సదరు ఎస్ఐ తనకు సహకరించలేదని ఆ నాయకుడు పగ పెంచుకున్నాడు. ఎస్ఐను బదిలీ చేయాల్సిందేనంటూ ఎమ్మెల్యే బాబు వద్ద భీష్మించుకుని కూర్చున్నాడు. అంతే కాదు సదరు ఎస్ఐని సూటిపోటి మాటలతో హింసిస్తున్నాడు. అధికార పార్టీ నాయకుడు కావడంతో ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక చివరకు ఆ ఎస్ఐ కాస్తా బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతూ, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు.
- వైఎస్సార్ సీపీ పాలనలో ఇసుక అక్రమ రవాణా, చెరువులను అక్రమంగా తవ్వేస్తున్నారంటూ గగ్గోలుపెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు తామే అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెరువులు తవ్వడమే కాకుండా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లు వదిలేయాలని రెవెన్యూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు.
- ఉద్యోగుల బదిలీలకు సంబంధించి తన తండ్రి హయాంలో పనిచేసిన వారికి, తమకు అనుకూలంగా ఉంటామనే వారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఎమ్మెల్యే బాబు పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. ఈ పోస్టింగుల విషయంలో ఎమ్మెల్యే పీఏ, మండల స్థాయి నాయకుల ప్రమేయం అధికంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇదే నియోజకవర్గంలోని మరొక మండలంలో వెలుగులో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది సైతం తన ఇంటికి రావాలని, ఏం జరుగుతుందో వివరాలు తనకు చెప్పాలని ఆ మండలంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుడు హుకుం జారీ చేశాడు. ఆ శాఖకు సంబంధించిన సమావేశాలను సైతం తన ఇంటి వద్దే నిర్వహించాలని ఆదేశించాడు. దీంతో సదరు అధికారులు, ఉద్యోగులు భయపడి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మొరపెట్టుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సతీమణి సదరు నాయకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించుకోవాలని, అక్కడకే ఎవరైనా వస్తారని సదరు వెలుగు ఉద్యోగులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అయినా కూడా కొందరిపై ఆ నాయకుడు అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నాడు.

పెత్తనం కోసం పంతం

కేపీటీపాలెంలో పరాకాష్టకు వర్గపోరు

- పది రోజులుగా తాగునీటి సరఫరా నిలిపివేత
- చోద్యం చూస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది
- తాగునీరు లేక గ్రామంలో దాహం కేకలు



గ్రామంలో నీళ్లు వదలకపోవటంతో పక్క గ్రామాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

కోనేరుసెంటర్: రెండు వర్గాల మధ్య వివాదం.. ఆ ఊరి ప్రజలకు తాగునీటి కష్టాలు తెచ్చిపెట్టింది. మా మనిషే నీళ్లు వదలాలి అని ఒక వర్గం పంతం పడితే లేదు మా మనిషే వదలాలంటూ మరో వర్గం పంతం పట్టటంతో గ్రామానికి తాగునీటి సరఫరా ఆగిపోయింది. ఏ ఒక్కరూ తగ్గేదేలే అంటుండటంతో విసుగు చెందిన జనం చేసేదిలేక పక్క గ్రామాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ రెండు వర్గాల మధ్య జరుగుతున్న పోరుతో తాగునీటి కోసం తహతహలాడుతున్న ఆ ఊరి జనం వెతలు ఇలా ఉన్నాయి. అధికారం మాది.. ఇప్పుడంతా మాదే పెత్తనం.. మేం సెప్పిందే శాసనం.. మనూరికి మా మనిసే నీళ్లొదులుతాడు.. కాదు కూడదు అన్నారో పొంపులు వదిలేపెనక్లేదు.. ఏం సేత్తారో సేసుకోండి.. లేదంటే మీ దిక్కున్నసోట సెప్పుకోండి అంటూ ఆ ఊరికి చెందిన తెలుగు తమ్ముళ్లు సవాళ్లు విసురుతుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అందుకు ఒప్పుకోము ఊరి జనం కోసం స్థలాన్ని దానం చేశాము కాబట్టి మా మనిషి ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందాల్సిందేనని ఊరికి చెందిన మరో వ్యక్తి ప్రతిసవాలు విసురుతున్నాడు. దీంతో గ్రామస్తుల పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో సున్నం అన్నట్లు తయారైందనటంలో ఎలాంటి సందేహంలేదనే చెప్పాలి.

అసలు కథ ఏంటంటే...

బందరు మండలం కెపిటిపాలెం గ్రామంలో సుమారు 250 గడప ఉంది. 500 వరకు జనాభా ఉన్నారు. ఈ ఊరికి తరకటూరు నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. గడిచిన ఐదేళ్ళుగా గ్రామస్తులకు ఏ ఒక్క రోజు కూడా తాగునీటికి కోసం ఇబ్బంది పడిన పరిస్థితి ఏర్పడలేదు. అయితే గడిచిన ఎన్నికలలో కూటమి అధికారంలోకి రావటంతో గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ కార్యకర్తలు అధికారం మారింది. తాము చెప్పిన మనిషే ట్యాంకు నుంచి పంపుల్లోకి నీళ్ళు వదలాలంటూ పెత్తనం చేయటం మొదలుపెట్టారు. గ్రామానికి చెందిన ఓ కుటుంబం వాటర్ ట్యాంకు నిర్మాణం జరిపేందుకు ఊరిలో వారికి చెందిన కొంత స్థలాన్ని దానం చేశారు. ట్యాంకు నిర్మాణం పూర్తయినప్పటి నుంచి గ్రామస్తులకు తాగునీటిని అందించేందుకు ఒకరిని నియమించుకున్నారు. ఇప్పుడు అతను వద్దని తాము వేరే వారిని నియమించుకుంటామంటూ టీడీపీ మద్దతుదారులు మంకుపట్టు పట్టారు. స్థలదాతేమో పని చేస్తున్న వ్యక్తిని తొలగించి మరొకరినెలా నియమిస్తారంటూ అభ్యంతరం తెలిపారు. అలా గడిచిన పది రోజులుగా గ్రామస్తులకు తాగునీరు వదలకుండా ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నియమించిన వర్కర్‌ను గ్రామంలోకి రావద్దంటూ రెండు వర్గాల వారు హెచ్చరిస్తున్నారు. చేసేదిలేని సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఊళ్లోకి వెళ్ళటం మానేశాడు. దీంతో గత పది రోజులుగా కెపిటిపాలెం గ్రామస్తులు తాగునీటి కోసం కటకటలాడిపోతున్నారు. గ్రామానికి చెందిన పెద్దలు రెండు వర్గాలకు సర్దిజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో గ్రామస్తులు దాహార్తిని తీర్చుకునేందుకు పొరుగు గ్రామమైన పల్లెపాలెం వైపు పరుగులు పెట్టాల్సి వస్తోంది. కొందరు ఇతర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్ టిన్‌లను కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు పంటబోదెల్లో నీరు వడగొట్టుకుని తాగుతున్నారు. గ్రామంలో జరుగుతున్న ఈ తతంగాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్తులు వాపోతున్నారు.

జెండా వీరుడు తోట నరసయ్య



మచిలీపట్నంలోని చారిత్రాత్మక కోనేరు సెంటర్ (ఇన్ సెట్‌లో తోట నరసయ్య)

మచిలీపట్నంటౌన్: స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. మహాత్మాగాంధీ పిలుపునందుకుని దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువకులు బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటానికి ముందుకువచ్చారు. అల్లూరి, భగత్ సింగ్, ఆజాద్‌ల స్ఫూర్తితో దేశం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించి భరతమాతను బానిస శృంఖలాల నుంచి విడిపించడానికి నడుం కట్టారు. అలాంటి ఎందరో మహనీయుల స్ఫూర్తితో మచిలీపట్నం ప్రాంతంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ వ్యక్తి తోట నరసయ్య.

చల్లపల్లి మండలం పాగోలుకు చెందిన తోట నరసయ్య మచిలీపట్నంలో వీరాస్వామి అనే పహిల్వాన్ వద్ద వస్తాదు తర్ఫీదు కోసం నరసయ్య వచ్చాడు. ఆ సమయంలో ఆంధ్ర జాతీయ కళాశాలలో భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆధ్వర్యాన జరిగిన బహిరంగ సభలో మహాత్మాగాంధీ ఉపన్యాసాన్ని విన్న తోట నరసయ్య ఉత్తేజితుడయ్యాడు. గాంధీజీ ఆదేశానుసారం ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నాడు. చిన్నాపురం నుంచి రెండు పిడికిళ్లతో నరసయ్య ఉప్పు తెస్తుండగా బ్రిటీష్ పోలీసులు ఆయన చేతిలోని ఉప్పును కిందపడేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. లాఠీలతో కొట్టారు. అయినా ఆయన చలించలేదు. బిగించిన గుప్పిట తెరిపించలేకపోయారు. చేసేది లేక నరసయ్యను అరెస్టు చేసి 13 నెలల పాటు కారాగార శిక్ష విధించారు. జైలు నుంచి తిరిగివచ్చిన నరసయ్య మచిలీపట్నంలోని కోనేరు సెంటర్ స్థూపంపై జాతీయజెండాను ఎగురవేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలిసి దాదాపు 20 మంది బ్రిటీష్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నరసయ్యను స్థూపంపై జెండా ఎగరనివ్వకుండా చేయాలని లాఠీలతో కొడుతూనే ఉన్నారు. పోలీసులు లాఠీలతో పొడుస్తూ కొడుతున్నా లెక్క చేయకుండా తోట నరసయ్య మచిలీపట్నం నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక కోనేరు సెంటర్ స్థూపంపై పెనుగులాడుతూనే జాతీయజెండాను ఎగురవేసి తన దేశభక్తి చాటుకున్నాడు.ఈ విషయం తెలిసిన గాంధీజీ ''హీ ఈజ్ ఫ్లాగ్ హీరో'' అని అన్నట్లుగా నాటి పెద్దలు చెబుతుంటారు. అప్పటి నుంచి 'జెండా వీరుడి'గా తోట నరసయ్య ప్రసిద్ధికెక్కారు. ఆ విధంగా మచిలీపట్నం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నరసయ్య పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చేరుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుంటూ క్రమశిక్షణతో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని చేరుకోవడానికి ఆసక్తి చూపిస్తూ ముందుకు వెళ్లాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో తిరంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకుని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ ఎన్‌వీకే ప్రసాద్, డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా అనేక చట్టాలు



ప్రత్యేకావసరాలు గల చిన్నారులతో న్యాయమూర్తి రామకృష్ణయ్య తదితరులు

పెడన: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అనేక చట్టాలు అండగా ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణ అన్నారు. పెడన బంగ్లా స్కూల్(ప్రాథమిక పాఠశాల)లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుంచుకోవాలన్నారు. దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులను, దివ్యాంగులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అలవెన్సులు సకాలంలో అందుతున్నాయా లేదా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. ఇంకా ఏమైనా మెరుగైన సేవలు అవసరమా అని ప్రశ్నించారు. బోధనోపకరణాలు, కృత్యాధార నమూనాలు అవసరమని సహిత విద్యా రిసోర్స్ పర్సన్(ఐ.ఈ.ఆర్పీ)రమ్య బదులిచ్చారు. విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ముసలయ్య, అజ్మతున్నిసా, పెడన ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్, ఎంఈవో–2 వై.హరనాథ్, దివ్యాంగ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుజుకీ యాక్సిస్, ఎవనిస్ బర్గ్మన్ స్కూటర్ల విడుదల



వినియోగదారునికి నూతన స్కూటర్ తాళాలను అందజేస్తున్న సుజుకీ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నాగపోతరావు సెంటర్‌లో ఉన్న రాజేశ్వరి మోటార్స్ షోరూమ్‌లో మంగళవారం సుజుకీ యాక్సిస్, ఎవనిస్ బర్గ్మన్ స్కూటర్ల నూతన మోడళ్లను ఆవిష్కరించారు. సుజుకీ రీజనల్ సేల్స్ మేనేజర్ శివరామకృష్ణ, ఏరియా సేల్స్ మేనేజర్ అరుణ్‌కుమార్ వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా అధునాతన మోడళ్లతో స్కూటర్లను విడుదల చేశామన్నారు. అనంతరం స్కూటర్లను కొనుగోలు చేసిన కస్టమర్లకు తాళాలు అందజేశారు. కార్యక్రమంలో షోరూమ్ యజమాని పోలిశెట్టి ప్రసాద్, వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సీఈవో అనూరాధ, జూపూడి అశోక్, యెండూరి సురేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడివాడ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను, అనంతరం స్థానిక మునిసిపల్ పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌లోని వసతులను పరిశీలించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి గుడివాడ వస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో హెలికాప్టర్‌లో దిగుతారని అక్కడి నుంచి మునిసిపల్ పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం పర్యటనలో ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీఓ పి.పద్మావతి, మునిసిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో చోరుల హల్‌చల్

పామర్రు: మండల కేంద్రమైన పామర్రులో సోమవారం హల్‌చల్ చేశారు. సెల్‌ఫోన్ షాపు, ఎలక్ట్రికల్ షాపు, టిఫిన్ సెంటర్ పై కప్పులను పగలగొట్టి చోరీలకు పాల్పడ్డారు. స్థానిక ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న ప్రసాద్ మొబైల్స్ షాపు పై కప్పు రేకును బద్దలు కొట్టి షాపులోకి ప్రవేశించి విలువైన రెండు సెల్ ఫోన్‌లు, రెండు ఇయర్‌బడ్స్, కౌంటర్‌లో ఉన్న రూ.2 వేల నగదును చోరీ చేశారు. ఆ షాపునకు సమీపంలోనే ఉన్న మధురవాణి ఎలక్ట్రికల్ షాపులో ప్రవేశించేందుకు పైకప్పు రేకులను బద్దలు కొట్టారు. రేకు కింద భాగంలో ఇనుప మెస్ ఉండటంతో చోరీకి వీలుపడలేదు. అదే రోడ్డులోని అన్నపూర్ణ టిఫిన్ సెంటర్ పై కప్పు రేకులను బద్దలు కొట్టి దానిలోకి ప్రవేశించి కౌంటర్‌లోని రూ.300 నగదు అపహరించారు. పోలీసుల గస్తీ ఉండే ప్రధాన కూడలికి కూతవేటు దూరంలో చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తన దుకాణంలో రూ.35 వేల విలువైన వస్తువులను దొంగలు అపహరించారని ప్రసాద్ మొబైల్స్ షాపు యజమాని జుఝువరపు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

కాలుజారి బావిలో పడి రైతు మృతి



మోపిదేవి: మండలంలోని మేళ్లమర్రు గ్రామానికి చెందిన ఆకుల రామయ్య(53) మంగళవారం తెల్లవారుజామున బావిలో శవమై తేలాడు. పోలీసుల కథనం మేరకు.. ఆకుల నాగలక్ష్మి, రామయ్య భార్యాభర్తలు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోమవారం రాత్రి తన పొలానికి నీరు పెట్టేందుకు రామయ్య ఇంటి నుంచి వెళ్లాడు. మంగళవారం ఉదయం నీళ్లు తోడేందుకు పెరటిలోని బావి వద్దకు వెళ్లిన నాగలక్ష్మికి భర్త నిర్జీవంగా నీటిలో తేలుతూ కనిపించాడు. దీంతో ఆమె భోరున విలపించింది. ఇరుగుపొరుగు వారు వచ్చి రామయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. అర్ధరాత్రి సమయంలో పొలం నుంచి ఇంటికి వచ్చిన రామయ్య బావి వద్ద కాళ్లు కడిగే క్రమంలో కాలు జారి బావిలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మారు తాళాలతో ఆలయ హుండీలో సొమ్ము చోరీ



చోరీ జరిగిన ఆంజనేయస్వామి ఆలయం

పెడన: మండల పరిధిలోని కొంకేపూడి గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు మారుతాళాలతో చోరీకి పాల్పడి హుండీలోని సొమ్ము అపహరించినట్టు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల భక్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ క్రమంలో హుండీలో పెద్ద ఎత్తున సొమ్ములు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయ నిర్వాహకులు సోమవారం రాత్రి పూజల అనంతరం ఆలయానికి తాళం వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం శుభ్రం చేసేందుకు రాగా ఆలయ తలుపులు, హుండీ తలుపులు తెరచి ఉన్నాయి. కమిటీ సభ్యులు వచ్చి చూడగా ఆలయంలో ఉంచిన విలువైన వస్తువులు, హుండీలో భక్తులు వేసిన సొమ్ములను ఆగంతుకులు ఎత్తుకెళ్లినట్టు గమనించారు. దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తులు ఈ ఆలయ ఆనుపానులు బాగా తెలిసిన వారే అయిఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఆలయాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో మేటి.. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల

ఏపీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పద్మారావు

గుడ్లవల్లేరు: రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను అందించే కాలేజీల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ ముందంజలో ఉందని ఏపీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వెలగా పద్మారావు అన్నారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని కాలేజీలో మంగళవారం వల్లూరుపల్లి రామ శేషాద్రిరావు స్మారక బహుమతుల అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంకేతిక విద్యా మండలి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ ర్యాంకర్స్‌కు వీవీఆర్ఎస్ఆర్ స్మారక అవార్డులను ఏటా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విజేతలు వీరే..

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో 2024 సంవత్సరానికి గానూ ప్రథమ ర్యాంకులు సాధించిన పి.రిషికకు రూ.10వేల విలువైన బంగారు పతకం, రూ.10వేల నగదు, డీటీఈ వారు ధ్రువీకరించిన ప్రశంసా పత్రాన్ని పద్మారావు చేతుల మీదుగా అందించారు. అలాగే రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలోకెల్లా ద్వితీయ ర్యాంకులు సాధించిన ఎ.యశస్వినికి రూ.5వేల విలువైన బంగారు పతకం, రూ.5వేల నగదు, డీటీఈ ధ్రువీకరించిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

క్లుప్తంగా

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ఘంటసాల: ఈ నెల 16 నుంచి మండలంలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న మల్లంపల్లి పంచాయతీ వద్ద (మల్లంపల్లి, బోళ్లపాడు), 17న యండకుదురు, 20న వి.రుద్రవరం, 22న చిలకలపూడి, 24న మల్లాయి చిట్టూరు, 27న పూషడం, 28న దేవరకోట (దేవరకోట, బిరుడుగడ్డ, ఎలికలకుదురు), 29న కొత్తపల్లి, 31న దాలిపర్రు, సెప్టెంబర్ 3న తాడేపల్లి, 4న కొడాలి, 5న చిట్టూర్పు, 6న లంకపల్లి, 10న వేములపల్లి, 11న చినకళ్లేపల్లి, 12న పాపవినాశనం, 13న శ్రీకాకుళం, 14న తెలుగురావుపాలెం, 17న అచ్చెంపాలెం, 18 ఘంటసాల గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామ సభలు జరుగుతాయన్నారు. కొడాలి, చిట్టూర్పు, శ్రీకాకుళం గ్రామాల్లో మాత్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

గూడూరు: గూడూరు మండలంలో ఈనెల 17 నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం అవుతాయని తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈనెల 17న ముక్కొల్లు, 20న గంగ్రం, 21న గూడూరు, 22న చిట్టిగూడూరు, 23న తరకటూరు, 24న పినగూడూరులంక, 27న జక్కంచర్ల, 28న కలపటం, 29న లేళ్లగరువు, 30న గురిజేపల్లి, 31న కంకటావ, సెప్టెంబరు 2న రామానుజవత్తర్లపల్లి, 3న నారికేడాలపాలెం, 4న కప్పలదొడ్డి, 5న కోకనారాయణపాలెం, 6న రామరాజుపాలెం, 9న ఆకుమర్రు, 10న కంచాకోడూరు, 11న మద్దిపట్ల, 12న రాయవరం, 13న పోలవరం, 14న ఐదుగుళ్లపల్లి, 15న రామన్నపేట, 17న ఆకులమన్నాడు, 18న మల్లవోలు గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు. షెడ్యూలు ప్రకారం ఉదయం 9 గంటలకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సదస్సులు జరుగుతాయని ఆమె వివరించారు.

చివరి భూములకు సాగు నీరివ్వండి మహాప్రభో!

- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వద్ద గోడు వెళ్లబోసుకున్న రైతులు
- కాలువలో దిగి పరిస్థితిని వివరించిన అన్నదాతలు
- తీరప్రాంత కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కాలువలో దిగి పరిస్థితిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వివరిస్తున్న రైతు

కోడూరు: సముద్రతీర ప్రాంతానికి సమీపంలో ఉన్న పంట పొలాలను సాగు చేసేందుకు సాగునీటిని అందించాలని రైతులు సోమవారం తమ గోడును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వద్ద వెళ్లబుచ్చుకున్నారు. దీంతో బుద్ధప్రసాద్ ఇరిగేషన్ అధికారులతో కలిసి మండలంలోని 14వ నంబర్ పంటకాలువ పరిస్థితిని పరిశీలించారు. ద్వారక గ్రామం వద్ద కాలువ బెడ్ లెవల్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ సమయంలో పలువురు రైతులు కాలువలో దిగి దిగువ కాలువలకు సాగు నీరు వెళ్లడం లేదంటూ అక్కడ పరిస్థితిని వివరించారు. కాలువ బెడ్ లెవల్, బ్రాంచ్ కాలువలకు ఏర్పాటు చేసిన తూముల లెవల్‌ను వివరిస్తూ సాగు నీరు దిగువకు వెళ్లకపోవడానికి కారణాలను కళ్లకు కట్టినట్లు ఎమ్మెల్యేకు చూపించారు. సమస్యను నిశితంగా పరిశీలించిన బుద్ధప్రసాద్ చివర భూములకు కూడా సాగునీటిని అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే అన్ని ప్రధాన, బ్రాంచ్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు చెప్పారు. సాగునీటి ప్రవాహానికి అవరోధం లేకుండా తూటికాడ, గుర్రపు డెక్కను కూడా తొలగించినట్లు చెప్పారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చివరి ఎకరానికి కూడా నీటిని అందిస్తామని, ఈ మేరకు ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నట్లు తెలిపారు.



ద్వారక వద్ద కాలువను పరిశీలిస్తున్న మండలి

మందపాకల కాలువ పనులు పరిశీలన

మండలంలోని మందపాకల కాలువకు జరుగుతున్న అభివృద్ధి పనులను బుద్ధప్రసాద్ పరిశీలించారు. సుమారు నాలుగు వేల ఎకరాల లబ్ధి చేకూర్చేలా పనులు చేస్తున్నట్లు బుద్ధప్రసాద్ వివరించారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందని, దీంతో పోటుమీద, మందపాకల, జరుగువానిపాలెం, పాదాలవారిపాలెం రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ యువనేత మండలి వెంకట్రామ్(రాజా), ఇరిగేషన్ డీఈ రవి కిరణ్, ఏఈలు విజయ్, రవితేజ, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి సీసీ రోడ్డు నిర్మాణం

కృత్తివెన్ను: నీలిపూడి ఆరోగ్య ఉపకేంద్రానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. రూ.2.5 లక్షలు మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు కాగా మిగిలిన నిధులను పంచాయతీ నుంచి ఖర్చు చేయనున్నట్లు సర్పంచ్ పాశం కృష్ణ తెలిపారు. ప్రధాన రహదారి నుంచి దాదాపు



55 మీటర్ల మేర ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఆయన వివరించారు. రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు నాగమల్లేశ్వరరావు, రాము, నాగరాజు, సుబ్బారావు, వెంకన్న తదితరులు పరిశీలించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోడూరు: కోడూరు పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దేవనబోయిన రామారావు(85) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ఊటగుండం గ్రామం వచ్చి రామారావు మృతదేహానికి నివాళులర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ నేతలు కూడా రామారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మృతిచెందిన కోడూరు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బడే ఆదినారాయణ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మండలి పరామర్శించారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పెడన: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచిగా చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి కేవీ రామకృష్ణ అన్నారు. స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, పోక్సో, పీడీ యాక్ట్ తదితర కేసుల్లో నమోదయితే వచ్చే ఇబ్బందులపై ఆయన అవగాహన కలిగించారు. విద్యార్థులు ఈ దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యత గల పౌరులుగా ఉండి భవిష్యత్తును మంచిగా తీర్చి దిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు రూపాయి ఖర్చు లేకుండా అందిస్తున్న న్యాయ సేవల గురించి వివరించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా మైనారిటీ తీర కుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు కావడంతో పాటు జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణ

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీ రామారావు, న్యాయవాదులు అహ్మతున్నీసా, ముసలయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం మండల పరిధిలోని కొంకేపూడి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో చైర్మన్ రామకృష్ణ పలు చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావు భైరవలింగ్, మాజీ సర్పంచ్ శలపాటి ప్రసాదు, ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్, గ్రామస్తులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పింగళి, తోట స్ఫూర్తితో దేశభక్తి నింపుకోవాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య, జెండా వీరుడు తోట నరసయ్య స్ఫూర్తితో విద్యార్థులు దేశభక్తిని నింపుకోవాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పింగళి వెంకయ్య, తోట నరసయ్య, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో ఎందరో మహనీయుల త్యాగాలతో సాధించిన స్వరాజ్యాన్ని నేటి యువత, విద్యార్థులు సురాజ్యంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య స్వగ్రామం చల్లపల్లి మండలం యార్లగడ్డ కావడం, జెండా వీరుడు తోట నరసయ్య స్వగ్రామం చల్లపల్లి మండలం పాగోలు కావడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. దివిసీమకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన యువనేత మండలి వెంకట్రామ్, ఎస్‌వీఎల్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, హర్ ఘర్ తిరంగా జిల్లా ఇన్‌చార్జి కొఠారి మురళీధర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పుప్పాల రాము, నియోజకవర్గ కోఆర్డినేటర్ టీవీ గిరితో పాటు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బీసీ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.రమేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వసతిగృహ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంపుదల చేయాలన్నారు. వసతి గృహాలకు మెస్ బిల్లులు చెల్లించటం ఆలస్యమవుతోందన్నారు. ప్రతి వసతిగృహంలో నాల్గవ తరగతి ఉద్యోగుల నియామకాలు చేపట్టాలన్నారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతిగృహాలను పెంచాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో వసతిగృహాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు జోగి శివ, ధనికొండ చిన్ని, ఎం.పవన్ ఉన్నారు.

నేడు బందరులో భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో బుధవారం 150 మీటర్ల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి రామ్‌లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. రాష్ట్ర భూగర్భవనరులు, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకె బాలాజీ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉదయం 8.30 గంటలకు నగరంలోని కోనేరుసెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో జిల్లా అధికారులతో పాటు నగర ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నాగాయలంకలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రేపు తిరంగా ర్యాలీ

నాగాయలంక: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్‌బ్రాంచి ఆధ్వర్యంలో సుదర్శి మానవతా సేవా సంస్థ పర్యవేక్షణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ బోగాది శివవిష్ణువర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పండుగలపై యువతలో అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తొలుత నాగాయలంక పుర వీధుల్లో భారీ జాతీయ పతాకంతో బాలబాలికలు, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు, గ్రామస్తులతో ప్రదర్శన, అనంతరం ప్రధాన కూడలి ట్రాఫిక్ ఐలెండ్ సెంటర్‌లో జాతీయ జెండా వందనం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని సుదర్శి మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ విజ్ఞప్తి చేశారు.